క్లుప్తంగా

ఆశాజనకంగా అపరాల పంటలు



లక్ష్మీపురంలో పెసరచేను తీయిస్తున్న రైతు రాంబాబు

సీతానగరం: మండలంలో ఖరీఫ్ వరిచేను కోయడానికి వారం రోజులు ముందుగా పంటలో వేసిన అపరాలు రైతులకు ఆర్థికంగా ఊరట నిస్తున్నాయి. సీతానగరం మండలంలో 350 హెక్టార్లలో మినుము, 150 హెక్టార్లలో పెసర పంటలను రైతులు సాగు చేశారని గణాంకాధికారుల లెక్కలు చెబుతున్నాయి. మినుము క్వింటా (100 కేజీలు) రూ.7,500 పలుకుతోందని, క్వింటా పెసలు రూ.10 వేల నుంచి రూ.10,500 పలుకుతోందని రైతులు చెబుతున్నారు. అపరాల పంటకు గిట్టుబాటు ధర ఉన్నందున రైతులు అపరాల పంట కూడిక చేయడంలో బిజీగా ఉన్నారు.

మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

● పార్వతీపురం రూరల్ సీఐ రవికుమార్



సీఐ రవికుమార్

పార్వతీపురంటౌన్: ఏఓబీ (ఆంధ్రా ఒడిశా సరిహద్దు) గ్రామాల్లో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించామని పార్వతీ పురం రూరల్ సీఐ రవికుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఏఓబీ గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పార్వతీపురం సర్కిల్ పరిధిలో ఎక్కువగా ఒడిశా గ్రామాలు ఉన్నందున అక్క డి నుంచి మద్యం, సారా, మాదక ద్రవ్యాలు గతంలో రవాణా జరిగేవని చెప్పారు. ప్రస్తుతం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు నాలుగు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని తెలిపారు. సిబ్బంది నిరంతరం నిఘా ఉంచి అక్రమార్కుల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు కూడా తమ పరిధిలో ఇటువంటి కార్యకలాపాలు గమనిస్తే తక్షణమే పోలీసు సిబ్బందికి సమాచారాన్ని అందజేయాలని కోరారు.

అనారోగ్యంతో గిరిజన బాలిక మృతి



శ్వేత (ఫైల్)

పాచిపెంట: అనారోగ్యంతో గిరిజన బాలిక మృతి చెందిన సంఘటన సాలూరు మండలం ఇటికివలస గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పాచిపెంట మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి వరకు చదివిన నిమ్మక శ్వేత (13) గతేడాది దసరా సెలవులకు ఇంటికి వెళ్లిన క్రమంలో అనారోగ్యానికి గురై చదువుకు స్వస్తి పలికింది. పాఠశాలలో చేరాలని ఉపాధ్యాయులు కోరినా అనారోగ్యం కారణంగా మరి చదివించమని కుటుంబసభ్యులు తెలిపారు. ఇటీవల కాలంలో శ్వేతకు ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబసభ్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. కుమార్తె మృతితో తల్లిదండ్రులు శ్యామల, రామారావు కన్నీటి పర్యంతమయ్యారు.

ఉచిత వైద్య శిబిరం రేపు

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని గొడ వీధిలో ఉన్న అభ్యుదయ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 6వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చింత శారద ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే ఈ కార్యక్రమంలో స్పెషలిస్టు వైద్యులు అందుబాటులో ఉంటారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 30 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరూ క్యాన్సర్ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. శిబిరానికి వచ్చే రోగులకు ఉచితంగా శస్త్రచికిత్స, మందులు అందజేయనున్నారన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

రేగిడి: మండలంలోని సోమరాజుపేట, అంబఖండి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ నాగరాజు ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత, ప్రయోజనాలను రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యవంతమైన పంట చేతికి వస్తుందని, వాటిని తినడం ద్వారా ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా తయారయ్యే జిల్లేడు కషాయంతో పంటకు పట్టే చీడపీడలు నివారించవచ్చని, పత్రద్రావణం, తూటాకు కషాయంతో వరి పంటలో దోమపోటును నివారించవచ్చన్నారు.

ఘనంగా గ్రామదేవత సంబరాలు

భామిని: మండలంలోని నేరడి-బిలో గ్రామదేవత బంగారమ్మతల్లి సంబరాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం అమ్మవారి ఘటాలను సుందరంగా అలంకరించి మేళతాళాలతో తిరువీధి నిర్వహించారు.

ఆకట్టుకున్న కోలాటం

భామిని: మండలంలోని బత్తిలి, భామిని కళింగ వైశ్య మహిళా సంఘాల ప్రతినిధులు ఆదివారం శ్రీకాకుళంలో నిర్వహించిన సహస్ర కోలాటం ప్రదర్శనలో భాగస్వాములయ్యారు. జిల్లా కళింగ వైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చేరేందుకు సహస్ర కోలాటం ప్రదర్శన నిర్వహించారు.

పశువుల బీమా సదుపాయం వినియోగించుకోవాలి

● పశుసంవర్ధక శాఖ ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్



మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ పశుబీమా సౌకర్యాన్ని పశువులపెంపకం దారులు వినియోగించుకోవాలని పశు సంవర్ధకశాఖ సీతానగరం సబ్‌డివిజన్ సహాయ సంచాలకుడు డాక్టర్ సీహెచ్ దీనకుమార్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన స్థానిక పశువైద్య కేంద్రంలో పశువులకు వైద్య సేవలందించిన అనంతరం పశు బీమా పథకం అమలుపై మాట్లాడుతూ గతంలో పశువులు వివిధ కారణాల వల్ల మృతిచెందితే వాటి పెంపకం దారులు ఆర్థికంగా ఇబ్బందులు పడేవారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పాడి రైతులకు ఆర్థిక భరోసా కల్పించడానికి దుక్కి పశువులు, గొర్రెలు మేకలున్న రైతులకు బీమా సౌకర్యాన్ని కల్పించిందని చెప్పారు. ఒక్కో పశువుకు బీమా పథకం మూడేళ్లు వర్తించే విధంగా ప్రీమియం రూ.1,999 చెల్లించవలసి ఉందన్నారు. రైతులు ఆర్థిక ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రభుత్వం షేరుధనంగా రూ.1,600 చెల్లిస్తుందని, రైతు వాటాగా నామమాత్రం రూ.399లు చెల్లించాల్సి ఉందన్నారు. రూ.399లు చెల్లించిన పశువులకు 3 సంవత్సరాలు బీమా వర్తిస్తుందని, ప్రీమియం చెల్లించిన మూడు సంవత్సరాల్లో ప్రమాదం వల్ల కానీ ఇంకేవిధంగా కానీ మృతిచెందిన పశువులకు బీమా వర్తిస్తుందని తెలియజేశారు. ఈ విషయాన్ని పశువులు, గొర్రెలు, మేకల పెంపకం రైతులు వినియోగించు కోవాలని కోరారు.ఇప్పటికే గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు వైఎస్ఆర్ పశుబీమా పథకం అమలుపై విస్తృతంగా ప్రచారం చేసి అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

పశువైద్య సహాయకులకు బదిలీలు..

సీతానగరం పశువైద్యశాఖ సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న బలిజిపేట,సీతానగరం మండలాల రైతుభరోసా కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న పశువైద్య సహాయకులకు బదిలీ అయిందని ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్ తెలియజేశారు. సీతానగరం మండలంలోని ఆర్బీకేల్లో విధులు నిర్వహిస్తున్న నలుగురు, బలిజిపేట మండలంలోని ఆర్బీకేల్లో విధులు నిర్వహిస్తున్న అరుగురు పశువైద్య సహాయకులను బదిలీ చేస్తూ జిల్లా పశువైద్యాధి కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు.

చెరకు ప్లాంటేషన్ పనుల్లో రైతులు



బుడ్డిపేటలో జరిగిన చెరకు ప్లాంటేషన్

సీతానగరం: మండలంలో ఖరీఫ్ వరిచేను నూర్పిడి, ధాన్యం విక్రయాల పనులు పూర్తి కావడంతో రైతులు చెరకు పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ ప్రాంత రైతులు వాణిజ్య పంటగా ఎంపిక చేసుకుని సాగుచేస్తున్న చెరకు పంటను సంకిలి ఈఐడీ ప్యారీస్ చక్కెరకర్మాగారానికి తరలిస్తారు. ఈ నేపథ్యంలో మట్టి నమూనాలు చేసిన పొలాల్లో కొత్తగా ప్లాంటేషన్ వేస్తున్నారు. నీటివనరులున్న గ్రామాల్లో రైతులు సంక్రాంతి పండగకు ముందే మట్టి నమూనాలు చేసి చెరకువిత్తనం వేయడానికి బోదెలు నిర్మాణం చేశారు. కళ్లాల్లో ఉన్న వరిచేను కుప్పల నూర్పు అనంతరం తయారైన ధాన్యాన్ని ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా నుంచి కొనుగోలు చేయడం పూర్తయింది. చెరకు ప్లాంటేషన్ వేయడానికి ఇదే అదునుకావడం వల్ల ప్లాంటేషన్ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. చెరకు సాగు విషయమై మండల ఏఓ ఎస్.అవినాష్ వద్ద ప్రస్తావించగా సంకిలి ఈఐడీప్యారీస్ చక్కెర కర్మాగారం యాజమాన్యం చెరకు ప్లాంటేషన్ చేయడానికి ముందుకు వచ్చిన రైతులకు రాయితీలు ప్రకటించింది. దీంతో మట్టి నమూనాలు చేసి, నీటి వనరులున్న రైతులు చెరకు విత్తనం నాటడంలో నిమగ్నమయ్యారని తెలిపారు.

మేధస్సు వెలికితీతకు పోటీలు దోహదం

రాజాం సిటీ: విద్యార్థుల్లో దాగిఉన్న మేధస్సును వెలికితీసేందుకు పోటీలు దోహదపడతాయని భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు పి.వేణుగోపాల్ అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏపీపీఎస్‌టీఎఫ్ (ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం) ఆధ్వర్యంలో మండల స్థాయి మేధోత్సవం పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ విద్యార్థులంతా తెలియని విషయాలను చర్చించుకోవడం ద్వారా జ్ఞానం పెరుగుతుందన్నారు. మండల స్థాయిలో జరిగిన ఈ పోటీలకు 26 మంది హాజరై, ప్రతిభ కనబరిచారు. ఇంగ్లిష్ మీడియంకు సంబంధించి, జె.సురేష్ (జెడ్పీహెచ్‌ఎస్, పొగిరి), ఎ.సుబ్రహ్మణ్యం (జెడ్పీహెచ్‌ఎస్, కంచరాం), జె.సాయివర్ధన్(జెడ్పీహెచ్‌ఎస్, కంచరాం)లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారని, తెలుగు మీడియానికి సంబంధించి, వై.లావణ్య (జెడ్పీహెచ్‌ఎస్, రాజాం), వి.అంజుశ్రీ(జెడ్పీహెచ్‌ఎస్, దోసరి), టి.ద్రాక్షాయని(జెడ్పీహెచ్‌ఎస్, బొద్దాం)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని, వీరంతా జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

విజేతలకు ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం సభ్యులు సర్టిఫికెట్లు అందించి, అభినందించారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన



పాలకొండ రూరల్: జిల్లాస్థాయి సైన్సు పోటీ పరీక్షకు ఎంపికైన విద్యార్థులతో ఫోరమ్ సభ్యులు

వీరఘట్టం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం సైన్స్ ప్రతిభా పరీక్ష నిర్వహించారు. జిల్లా ఫిజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో పరీక్ష నిర్వహించినట్లు జిల్లా సైన్స్ ఫోరం అధ్యక్షుడు జి.లక్ష్మణరావు తెలిపారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో సైన్స్ సబ్జెక్టు పేపర్‌ను విద్యార్థులు ఒత్తిడి లేకుండా, సులభంగా రాసేందుకు ఈ పరీక్ష ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. వీరు ఈ నెల 18న జరిగే జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో పాల్గొంటారని తెలిపారు.

పాలకొండ రూరల్: ఏపీ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుల ఫోరమ్ ఆధ్వర్యంలో మండలంలోని పదో తరగతి విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఫోరమ్ మండల అధ్యక్షుడు సూరి శ్రీనివాసరావు, సెక్రటరీ ఎల్‌వీ రమణమూర్తి, హెచ్‌ఎం మీసాల సూర్యనారాయణ నేతృత్వంలో ఈ పరీక్ష నిర్వహించారు. ఇంగ్లిష్ మీడియంలో రుంకు రత్నాజీ, ఎస్.నిఖిల్‌సాయి, ఆర్.కౌశిక్, తెలుగు మీడియంలో సవిరిగాన మనోహర్, వారాడ రమ్య, డి.రమ్య తొలి మూడు స్థానాల్లో నిలిచారు. వారు ఈ నెల 18న జరిగే జిల్లాస్థాయి పోటీలో పాల్గొనున్నారు.

ధ్రువపత్రాలు అందజేత



ధ్రువీకరణ పత్రాలు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

భామిని: మారుతున్న విద్యావిధానం, ఆధునిక బోధనలతో పాటు డిజిటల్ ఇండియాకు అవసరమైన కంప్యూటర్ విజ్ఞానం అవసరమైని కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్, వ్యాపారవేత్త గుడ్ల సత్యారావు అన్నారు. మండలంలోని ఘనసరలో గ్రామీణ వికాస్ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంప్యూటర్ శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ఆదివారం ధ్రువపత్రాలు అందజేశారు. ఘనసర కాలనీలోని డాక్టర్ కలాం డ్రీమ్స్ కంప్యూటర్ సెంటర్‌లో విద్యార్థులకు మూడు నెలల పాటు కంప్యూటర్ బేసిక్స్‌పై శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వలరౌతు ప్రసాద్, కొనపల నీలకంఠం, ధార్మిక మండలి కన్వీనర్ వై.అప్పలనాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పార్టీ గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్, పక్కనే వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

● ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

రేగిడి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు కోసం ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్ కోరారు. ఇదే విషయమై మండల కేంద్రంలో మండలంలోని పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో ఆదివారం సమావేశమైన వారు ప్రతీ గ్రామంలో బూత్ కమిటీలు ఏర్పాటు చేయాలని, బూత్ కన్వీనర్లకు ఎన్నికల గెలుపు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. ఈ నాలుగున్నరేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని ప్రతీ ఇంటికి తెలియజేయాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్న తీరు, పాలనలో ఆయన తీసుకువచ్చిన సంస్కరణలతో ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించాలన్నారు. పార్టీ, ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన ప్రతీఒక్కరి ఓటు పార్టీకి పడేలా చూడాలన్నారు. మరో మూడు నెలలు కష్టపడితే అధికారం మళ్లీ మనదేనని ధీమా వ్యక్తం చేశారు. సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని, అహర్నిశలు శ్రమించాలన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి పార్టీలో సముచిత గౌరవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్‌మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ కింజరాపు సురేష్‌కుమార్, యూత్ కన్వీనర్ మజ్జి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

తెర్లాం: బొండపల్లి తహసీల్దార్ రమణయ్య హత్య కేసు నిందితులను కఠినంగా శిక్షించాలని వీఆర్‌వోల సంఘం నాయకుడు సువ్వాడ నరసింహనాయుడు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని విలేకరులతో ఆదివారం మాట్లాడిన ఆయన భూ వివాదాల కారణంగా తహసీల్దార్‌ను దుండగులు హత్య చేయడం దారుణమన్నారు. ఈ దుర్ఘటనను వీఆర్‌వోల సంఘం తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని, బాధిత కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నామన్నారు. నిందితులను త్వరగా పట్టుకుని, అరెస్ట్ చేయాలన్నారు. తహసీల్దార్లకు ప్రభుత్వం మరింత రక్షణ కల్పిస్తూ భరోసానివ్వాలన్నారు. మళ్లీ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కోరారు.

10న ప్రజ్ఞా వికాస పరీక్ష

గుమ్మలక్ష్మీపురం: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ), ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 10వ తరగతి విద్యార్థులకు ఈ నెల 10న ప్రజ్ఞా వికాసం పరీక్ష నిర్వహించనున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి డి.పండు, గుమ్మలక్ష్మీపురం మండలం కార్యదర్శి ఎ.గంగారాం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారికి రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు చొప్పున నగదు ప్రోత్సాహకం అందించనున్నట్లు తెలిపారు. అలాగే మండల స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు తగిన ప్రోత్సాహకాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 7వ తేదీలోగా రూ.30 ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకొని హాల్‌టిక్కెట్లు తీసుకోవాలని కోరారు. పరీక్ష ఓఎంఆర్ షీట్‌పై ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుందన్నారు. మ్యాథ్స్-20, సోషల్ స్టడీస్-20, ఇంగ్లిష్-20, ఎన్‌ఎస్-10, పీఎస్-10, తెలుగు-10, హిందీ-10 మార్కులు చొప్పున్న మొత్తం 100 మార్కులకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 88971 91541కు సంప్రదించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కుటుంబాలు



పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

● ఆహ్వానించిన ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: ప్రతిపక్ష పార్టీ నాయకులు మాయమాటలు నమ్మి నమ్ముకున్న పార్టీని కాదని ఇటీవల కాలంలో టీడీపీలో చేరిన వారంతా వెనక్కి వచ్చారు. ఈ మేరకు పట్టణంలోని 1, 30వ వార్డులకు చెందిన కొన్ని టీడీపీ కుటుంబాలు ఎమ్మెల్యే అలజంగి జోగారావు సమక్షంలో క్యాంప్ కార్యాలయంలో పార్టీ కండువా వేసుకుని వైఎస్సార్‌సీపీ తీర్థం ఆదివారం పుచ్చుకున్నాయి. వారందరికీ ఎమ్మెల్యే ఆహ్వానం పలుకుతు పేదల అభ్యున్నతి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని, ఎవరు ఎన్ని అబద్ధాలు చెప్పినా నమ్మి మోసపోయే స్థితిలో ప్రజలు లేరన్నారు. అందరికీ సమాన అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆర్ చిన్నంనాయుడు, సర్పంచ్ రామకృష్ణ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కులగణన పరిశీలన



మండల కేంద్రంలో కులగణన చేస్తున్న అధికారులు

సీతానగరం: మండలంలోని పెదభోగిలి మేజర్ పంచాయతీలో ఉన్న నాలుగు గ్రామాల్లో గ్రామ వలంటీర్లతో జరుగుతున్న కులగణన కార్యక్రమాన్ని ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ, బుడ్డిపేట వీఆర్వో ఎం.సింహాచలం ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నతాధికారుల సూచనల మేరకు పెదభోగిలి పంచాయితీలో నిర్దేశించిన గడువులోగా కులగణన పూర్తి చేయడానికి సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు సమన్వయంతో పనిచేస్తున్నారన్నారు. అలాగే పెదభోగిలి పంచాయితీలో ఉన్న సీతానగరం, అప్పయ్యపేట, బుడ్డిపేట పెదభోగిలి గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు నిర్వహిస్తున్న కులగణన పూర్తి కావచ్చిందని తెలియజేశారు. గ్రామాల్లో కులగణనకు వస్తున్న అధికార సిబ్బంది గ్రామ వలంటీర్లకు అవసరమైన సమాచారాన్ని అందించాలని కోరారు. ప్రజల వెసులుబాటు చేసుకుని ఇంటింటి సర్వే చేయనున్నట్లు తెలిపారు. వీలైనంత తొందరలో కులగణన పూర్తి చేయాలని ద్వితీయ శ్రేణి అధికార సిబ్బందికి సూచనలిచ్చినట్లు చెప్పారు.

ముమ్మరంగా భూసార పరీక్షలు



రైతుల నుంచి సేకరించిన మట్టినమూనాలు

పాలకొండ: రైతులు సాగులో అధిక దిగుబడులు సాధించేందుకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటోంది. ఆర్బీకేల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, యంత్రపరికరాలు రాయితీపై అందిస్తోంది. అలాగే భూసార పరీక్షలు చేపట్టి అందుకు అనువుగా ఎరువుల వినియోగంపై శాస్త్రవేత్తలతో సూచనలు, సలహాలు అందిస్తోంది. మండలంలో 32 మట్టి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించారు. మండలంలోని 22 రైతు భరోసా కేంద్రాల్లో మట్టినమూనాల సేకరణ ముమ్మరంగా జరుగుతుంది.

కౌలురైతుల రుణాలు మాఫీ చేయాలి



కౌలు రైతులతో సమావేశం నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

పాలకొండ: కౌలు రైతులు తీసుకున్న పంటరుణాలను మాఫీ చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు కోరారు. మండలంలోని ఎల్.ఎన్.పేట గ్రామంలో ఆదివారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కౌలు రైతులను ఆదుకోవడంతో పాటు జంపరకోట రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలని కోరారు. కౌలు రైతుల సమస్యలపై ఈ నెల 8న చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ద్వారపూడి అప్పారావు, కిమిడి రామూర్తి, సిమ్మినాయుడు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం సహాయ నిధి

● జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



వంగర: బాధితుడికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, తదితరులు

వంగర: దీర్ఘకాలిక వ్యాధులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఎంతోమంది నిరుపేదలకు సీఎం సహాయ నిధి(సీఎంఆర్‌ఎఫ్) అండగా నిలుస్తోందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో మండలంలోని బంగారువలస గ్రామానికి చెందిన మిరియాల అశోక్‌కు మంజూరైన రూ.1.30 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును జెడ్పీ చైర్మన్ చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. పేదల ఆరోగ్యం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య శ్రీ పథకం ద్వారా రూ.25 లక్షల వరకు వైద్యం చేయించుకునే అవకాశం కల్పించారని, దీంతో పాటు సీఎం సహాయ నిధి నుంచి వైద్య ఖర్చుల కోసం సాయమందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్, సర్పంచ్ సాదెం లలితకుమారి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

రాజాం: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండలంలోని గడిముడిదాం గ్రామానికి చెందిన కల్లేపల్లి తిరుపతిరావుకు మంజూరైన రూ.1 లక్ష సీఎంఆర్‌ఎఫ్ (ముఖ్యమంత్రి సహాయనిధి) చెక్కును పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్ చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. అనారోగ్యం కారణంగా తిరుపతిరావు గత కొన్నాళ్లుగా పలు ఆస్పత్రిల్లో చికిత్స పొందుతూ వస్తున్నారు. అతడు నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సాయం కోరగా, తక్షణమే సాయం మంజూరైందని రాజేష్ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాజాం అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, రాజాం వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన అవసరం

విజయనగరం ఫోర్ట్: క్యాన్సర్ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి కె.సత్యం అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా రెడ్‌క్రాస్ రూపొందించిన కరపత్రాలను ఆదివారం పంపిణీ చేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ కూడలి నుంచి ఎత్తు బ్రిడ్జి మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్, కోట జంక్షన్, మూడు లాంతర్లు, గంటస్తంభం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్యాన్సర్ చాలా ప్రమాదకరమైన వ్యాధిన్నారు. అవగాహనతో వ్యాధిని నియంత్రించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో బి.రామకృష్ణారావు, డి.గౌరి, రమణ, సురేష్, సత్యారావు, రమేష్ పాల్గొన్నారు.

అవగాహనతో అడ్డుకట్ట..

విజయనగరం: ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా శ్రీ సాయికృష్ణా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అయ్యన్న పేట జంక్షన్ వద్దనున్న క్లబ్ నడక మైదానంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు తాడ్డి ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్యాన్సర్‌పై అవగాహన కల్పించడంతో పాటు వాసవీ డయాగ్నస్టిక్ సెంటర్ వారి సౌజన్యంలో మధుమేహ పరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన క్లబ్ గౌరవ సలహాదారుడు పిన్నింటి సూర్యనారాయణ, క్లబ్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఏఎస్ ప్రకాశరావు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవడంతో పాటు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అలాగే క్రమం తప్పకుండా వ్యాయామం చేయడంతో పాటు ఆహార నియమాలు పాటించాలన్నారు.

కేన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి



ఆరోగ్య తనిఖీలు చేస్తున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రాజాం సిటీ: ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరూ కేన్సర్‌పై అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా స్థానిక సెయింట్ ఆన్స్ హాస్పిటల్‌లో రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్యులు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేన్సర్ బారిన పడకుండా ఉండేందుకు తప్పనిసరిగా మార్చుకోవాల్సిన అలవాట్లు మార్చుకోవాలన్నారు. చెడువ్యసనాలకు దూరంగా ఉండడంతో పాటు రోజూ తీసుకునే ఆహారంలో ఎక్కువగా ఫైబర్ ఉన్న పదార్థాలను తీసుకోవాలన్నారు. పండ్లు, కూరగాయలు తీసుకోవడం, వారంలో రెండుసార్లు చేపలు తినడం ద్వారా కేన్సర్ బారిన పడకుండా ఉండొచ్చన్నారు. ప్రజలను చైతన్యం చేసేందుకు ఇటువంటి శిబిరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు.